క్లుప్తంగా

బాధ్యతలు చేపట్టిన స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్


వి.నాగలక్ష్మీదేవి

కర్నూలు(లీగల్): సీబీడీ కేసుల్లో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితురాలైన సీనియర్ న్యాయవాది వి.నాగలక్ష్మీదేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. క్రైం ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ పోలీసులు నమోదు చేసిన కేసుల్లో పోలీసుల తరఫున వాదనలు వినిపిస్తారు. ఆమెను స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమిస్తూ బుధవారం ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేయడంతో గురువారం ఆ మేరకు ఆమె బాధ్యతలు చేపట్టారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటాలి

కర్నూలు (టౌన్): ఈ నెల 13, 14 తేదీలలో గన్నవరంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటాలని సాంఘిక సంక్షేమ ఉద్యోగుల సంఘం సభ్యుడు గంగాధర్ అన్నారు. గురువారం స్థానిక బిక్యాంప్ క్రీడా మైదానంలో జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోనే హ్యాండ్‌బాల్ క్రీడకు మంచి ఆదరణ ఉందన్నారు. రాష్ట్ర స్థాయిలో వచ్చిన అవకాశాన్ని క్రీడాకారులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో క్రీడా సంఘాల ప్రతినిధులు మహబూబ్ సుభాని, సుబ్బయ్య, బడే సాహెబ్ పాల్గొన్నారు.

నకిలీ విత్తన కంపెనీలపై చర్యలు తీసుకోండి


మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు పి.మధు

కర్నూలు(సెంట్రల్): నకిలీ విత్తన తయారీ కంపెనీలపై చర్యలు తీసుకోవాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు పి.మధు డిమాండ్ చేశారు. గురువారం కర్నూలులో రైతుల సంఘాల ఆధ్వర్యంలో మహాధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రామచంద్రయ్య, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నకిలీ విత్తనాలను తయారు చేసే కంపెనీలకు ప్రోత్సాహాలు ఇవ్వడం అన్యాయమన్నారు. బీజేపీ ప్రభుత్వం రైతు వ్యతిరేకి అన్నారు. రైతులను ఆదుకోకపోతే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు జి.రామకృష్ణ, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మహిళా మోర్చా కార్యవర్గ సభ్యులుగా అరుణారెడ్డి

- రాష్ట్ర ఆదర్శ్ అంగన్‌వాడీ సహ కన్వీనర్‌గా గీతా మాధురి


అరుణారెడ్డి


గీతా మాధురి

కర్నూలు కల్చరల్: భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎల్లటూరు అరుణారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు నిర్మల కిషోర్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఆదర్శ్ అంగన్‌వాడీ సహ కన్వీనర్‌గా సురవరం గీతా మాధురిని నియమించారు. ఈ నేపథ్యంలో ఎల్లటూరు అరుణారెడ్డి మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు నిర్మల కిషోర్, రాష్ట్ర కార్యదర్శి గీతా మాధురి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజుకు ధన్యవాదాలు తెలిపారు. తనకు ఇచ్చిన బాధ్యతలను, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేస్తానని పేర్కొన్నారు.

ఐపీ భవనం పనులు ప్రారంభం


పాత భవనాలు కూల్చివేస్తున్న దృశ్యం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఇన్‌పేషంట్ల కోసం కొత్త ఐపీ బ్లాక్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం ఉన్న ఓపీ బ్లాక్ వెనుక భాగంలో 80 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ భవనం నిర్మించనున్నారు. ఈ మేరకు ఇప్పటికే ఈ ప్రాంతంలో ఉన్న పాత భవనాలను కూల్చివేస్తున్నారు. తాజాగా గురువారం నూతన భవన నిర్మాణానికి గాను పునాదుల పనులు సైతం ప్రారంభించారు. అక్కడకు ఎవ్వరూ వెళ్లకుండా ఆసుపత్రి సిబ్బంది, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సెక్యూరిటీ గార్డులు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇదే సమయంలో పాత భవనాల కూల్చివేత పనులు త్వరగా పూర్తి చేయాలని సదరు కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

మా ఇంటికి ఐదు పథకాలొచ్చాయ్..

- జగనన్న మేలు మర్చిపోలేం
- ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌తో మహిళ తిప్పమ్మ
- పెద్ద పడఖానలో 'గడప గడపకు మన ప్రభుత్వం'


వన్‌టౌన్ ప్రాంతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): 'అన్నా.. మాది బీద కుటుంబం. జగనన్న తెచ్చిన పథకాల వల్ల మాకు శానా మేలు జరిగింది. ఈ మూడేళ్లలో అమ్మ ఒడి కింద రూ.29 వేలు, వైఎస్ఆర్ సున్నా వడ్డీ కింద రూ.3,863, వైఎస్ఆర్ ఆసరా కింద రూ.3258, జగనన్న చేదోడు కింద రూ.20 వేలు, వైఎస్ఆర్ పింఛన్ కానుక కింద రూ.82వేలు మొత్తం రూ.1,38,121 మా బ్యాంకులో వేసినాడు. ఆయన సీఎం ఐనాక మా ఇంటి ఐదు పథకాలిచ్చినాడు. ఈయన మాలాంటి బీదలకు శానా మంచి సేస్తున్నాడు.' అంటూ ఎమ్మెల్యే ఎంఏ హాఫీజ్‌ఖాన్ ముందు సంతోషాన్ని వ్యక్తం చేసింది పెదపడఖానకు చెందిన డి.తిప్పమ్మ. గురువారం ఎమ్మెల్యే 8వ వార్డులో వివిధ శాఖల అధికారుల కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పెద్ద పడఖానలో వీధుల్లో ఇంటింటికి వెళ్లి ప్రజలను పలుకరిస్తూ వారి సమస్యలు, ఇబ్బందులు తెలుసుకున్నారు. ప్రభుత్వం మూడేళ్లలో మంజూరు చేసిన పథకాల సంక్షేమ క్యాలెండర్‌ను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు అందాలంటే ఎన్నో నిబంధనలు ఉండేవన్నారు. ఒకరు చనిపోతేనే మరొకరికి పింఛన్ వచ్చేదని, అందుకు జన్మభూమి కమిటీలు, టీడీపీ నాయకులకు ముడుపులు ఇవ్వడంతో పాటు వారి దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉండేవన్నారు. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూనే అర్హతే ప్రామాణికంగా అమలు చేస్తున్నారని చెప్పారు. పథకాలకు హద్దులు లేకుండా ఇచ్చి మహిళల ఆర్థికాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని వెల్లడించారు. వచ్చే ఎన్నికల్లో తమ సంక్షేమ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు సభ్యుడు అబ్రార్, స్థానిక నాయకులు షాకీర్, ఫారూక్, యూసుఫ్, బాసిత్, శ్రీను, ముస్తాక్, ఇమ్రాన్ అలీ, హుసేన్, వివిధ శాఖ అధికారులు, ఉద్యోగులు, పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు 'పీఎంఎస్‌బీవై'

- ద్వామా పీడీ అమరనాథరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్):ఉపాధి పనులకు హాజరయ్యే కూలీలను ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై) కింద నమోదు చేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి అన్నారు. ఇప్పటి వరకు ఉపాధి కూలీలకు సరైన బీమా సదుపాయం లేదని, పీఎంఎస్‌బీవై కింద నమోదు కావడం వల్ల మంచి ఉపయోగాలు ఉన్నాయని ఆయన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఉపాధి పనులకు వచ్చే కూలీలు దాదాపు 3.50 లక్షల మంది ఉన్నారని, ప్రతి ఒక్కరిని నమోదు చేయాలని ఆయన ఉపాధి సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. ఏటా కేవలం రూ.20తో పీఎంఎస్ బీవై కింద నమోదు చేయవచ్చని, రూ.20 కూడా ఆటోమేటిక్ కటింగ్ పెట్టుకోవచ్చని తెలిపారు. ప్రమాదవశాత్తు మరణిస్తే వారసులకు రూ.2 లక్షలు పరిహారం, శాశ్వత అంగ వైకల్యం పొందినా రూ.2 లక్షల వరకు పరిహారం లభిస్తుందన్నారు. పాక్షిక అంగవైకల్యం పొందితే రూ.లక్ష పరిహారం వస్తుందని తెలిపారు. దీనిపై ఉపాధి కూలీలకు అవగాహన కల్పించాని సిబ్బందికి సూచించారు.

సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత లేదా?

- రవాణ, ఆర్‌అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న
- పారిశుద్ధ్య లోపం, కార్గొ సేవల్లో జాప్యంపై ఆగ్రహం
- అధికారుల పనితీరుపై అసంతృప్తి


కొత్త బస్టాండ్‌లో ఆకస్మికంగా తనిఖీ నిర్వహిస్తున్న రవాణ, ఆర్ అండ్ బీ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న

కర్నూలు(రాజ్‌విహార్): 'కర్నూలు బస్‌స్టేషన్‌కు ఎంతో చరిత్ర ఉంది. అలాంటిది ప్రయాణికులకు తగిన సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ఉంది. కానీ మీరు ఇలా వదిలేస్తే ఎలా?' అంటూ రవాణ, ఆర్ అండ్ బీ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మంత్రాలయంకు వచ్చిన ఆయన కర్నూలు కొత్త బస్టాండ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బస్‌స్టేషన్‌లో పారిశుద్ధ్య లోపం, తగిన సౌకర్యాలు లేకపోవడం పట్ల అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా డ్రైనేజీ దుర్వాసన, ఎక్కడపడితే అక్కడ చెత్త ఏమిటని ప్రశ్నించారు. కార్గొ, కొరియర్ బుకింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసి అక్కడ అందుతున్న సేవల పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. సరుకు, పార్శిల్స్ రవాణ కోసం ఎంతో ప్రతిష్టాత్మంగా తీసుకొచ్చిన కార్గొ సేవాల్లో జాప్యం తగదని హెచ్చరించారు. బస్‌స్టేషన్‌లో సౌకర్యాల కల్పనపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. సంస్థ ద్వారా అందుతున్న సేవలు, సమయపాలనపై ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. సమయానికి బస్సులు నడపడం లేదని, బస్సుల నిర్వహణ సరిగా లేని కారణంగా పెద్ద పెద్ద శబ్దాలు రావడం, ఎక్కడ పడితే అక్కడ అగిపోతున్నాయని ప్రయాణికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన తీరు మార్చుకొని ప్రయాణికులకు మంచి సేవలందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్టీసీని ప్రజా రవాణ శాఖలో విలీనం చేసిన తరువాత ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. ప్రయాణికుల ఆదరణ మరింత పొంది లాభాల్లోకి వచ్చేందుకు అన్ని విధాలా కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ఆయన వెంట ఆర్టీసీ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ప్రిన్సిపల్ సెక్రటరీ

కర్నూలు(సెంట్రల్): ఆర్‌అండ్‌బీ, రవాణా, ఆర్టీసీ శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న గురువారం ఉదయం మంత్రాలయంలో జరిగిన వివిధ శాఖల అధికారుల సమీక్షలో పాల్గొని సాయంత్రం కర్నూలుకు వచ్చారు. ఆయనను కలెక్టర్ పి.కోటేశ్వరరావు తన నివాసానికి ఆహ్వానించి జిల్లా సమస్యలపై చర్చించారు.

జగనన్న చెప్పారంటే.. చేస్తారంతే

- ఇచ్చిన హామీ మేరకు పెన్షన్ పెంపు
- ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య
- శరీన్‌నగర్ పార్కులో పెన్షన్ వారోత్సవాలు


లబ్ధిదారులకు వైఎస్సార్ పెన్షన్ కానుకను అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ రామయ్య

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏదైనా చెప్పారంటే చేసేస్తారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ పెన్షన్ కానుకను విడతల వారీగా పెంచి లబ్ధిదారులకు అందజేస్తున్నారని చెప్పారు. గురువారం కల్లూరు అర్బన్ 30వ వార్డు శరీన్‌నగర్ పార్కులో వైఎస్సార్ పెన్షన్ కానుక వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య ముఖ్య అతిథులుగా హాజరై 26 నుంచి 35వ వార్డుల్లోని లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో పేదల ఇబ్బందులను కళ్లారా చూసి నవరత్నాల పథకాలను ప్రకటించారన్నారు. అధికారంలోకి వచ్చాక నవరత్నాల పథకాలను అమలు చేస్తూ పేద ప్రజల ఆర్థిక ఇబ్బందులను తొలగిస్తున్నారన్నారు. కరోనా సమయంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధ్వానంగా మారినా పేదల కోసం సంక్షేమ పథకాలను నిరాటకంగా కొనసాగించిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు.

అర్హతే ప్రామాణికంగా పెన్షన్

అవ్వాతాతలు, ఒంటరి మహిళలు ఇతర లబ్ధిదారుల మోహాల్లో చిరునవ్వే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ పింఛన్‌ను అందిస్తోందని ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య అన్నారు. ఈ మాసంలో రూ. 250 అదనంగా పెంచి పెన్షన్‌దారుల చేతికి రూ. 2,750 అందిస్తున్నామన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇంత మొత్తంలో పెన్షన్లు అందించడం లేదన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పెన్షన్‌కు అర్హత ఉన్నప్పటికీ జన్మభూమి కమిటీ సిఫారసులపై ఆధారపడాల్సి వచ్చేదన్నారు. నేడు రాష్ట్రంలో అర్హతే ప్రామాణికంగా పెన్షన్ అందిస్తున్నామన్నారు. రాష్ట్రానికి పట్టిన చంద్రగ్రహణం తొలగిపోవాలన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థలతో నిజమైన పేదలందరికీ లబ్ధి చేకూరుతుందన్నారు. వలంటీర్లు వారి కేటాయించిన 50 కుటుంబాలో అర్హులైన వారికి సంక్షేమ పథకాలను నేరుగా అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, కార్పొరేటర్లు కాశపోగు జయరాముడు, సంగాల సుదర్శన్‌రెడ్డి, సాన శ్రీనివాసులు, ఎరుకల వెంకటేశ్వర్లు, సాపురు మాధురి, ఇప్పల నారాయణరెడ్డి, దండు లక్ష్మీకాంతరెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివ శంకర్‌రెడ్డి, టీపీఆర్ఓ(మెప్మా అధికారి) వెంకటలక్ష్మి, 21వ వార్డు ఇన్‌చార్జ్ బాలచంద్రారెడ్డి, 35వ వార్డు ఇన్‌చార్జ్ సాపురు వీరయ్య, 30వ వార్డు ఇన్‌చార్జ్ సంజన్న, తిరుమలేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జైన్ ఆలయాలను పర్యాటక కేంద్రాలుగా మార్చొద్దు


కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న జైనులు

కర్నూలు కల్చరల్: పవిత్రమైన జైన్ ఆలయాలను పర్యాటక కేంద్రాలుగా మార్చడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని కర్నూలు జైన్ శ్వేతాంబర్ మూర్తి పూజక్ సంఘ్ ప్రతినిధులు వెల్లడించారు. ఝార్ఖండ్ రాష్ట్రంలోని సమేద్ శిఖర్జీ క్షేత్రం, గుజరాత్ రాష్ట్రంలోని పాలితనా గిరిరాజ్ క్షేత్రాలను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు పర్యాటక కేంద్రాలుగా చేస్తూ నిర్ణయం తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ సంఘ్ ఆధ్వర్యంలో గురువారం నిరసన వ్యక్తం చేశారు. కర్నూలు పాత బస్తీలోని జైన్ ఆలయం నుంచి కలెక్టరేట్ వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. సంఘ్ నాయకులు మాట్లాడుతూ.. దేశంలో సమేద్ శిఖర్జీ, పలితానా గిరిరాజ్ క్షేత్రాలు జైన్‌లకు అత్యంత పరమ పవిత్రమైనవన్నారు. అలాంటి ఆలయాలను పర్యాటక కేంద్రాలుగా మార్పు చేయడం మా మనోభావాలను కించపరిచినట్లే అన్నారు. పర్యాటక కేంద్రాలుగా చేయడంతో పవిత్రత పోవడంతోపాటు ఆధ్యాత్మికత దెబ్బతింటుందన్నారు. నిరసనలో జైన్ గురువు కీర్తన్ ప్రభ సురీజీ, జైన్ సంఘ్ సభ్యులు దినేష్ జైన్, జయంతిలాల్ జైన్, రమణ్‌లాల్, రంజిత్, భరత్, అశోక్, ప్రకాష్ జైన్, రమేష్, కీర్తి కుమార్ జైన్, ఉత్తమ్ కుమార్, భికం జైన్, మహిందర్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

వడ్డె ఓబన్న జయంతిని ఘనంగా నిర్వహిద్దాం

కర్నూలు(అర్బన్): స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతిని ఈ నెల 11న ఘనంగా నిర్వహిద్దామని ఆంధ్రప్రదేశ్ వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల లక్ష్మీకాంతయ్య పిలుపునిచ్చారు. గురువారం స్థానిక బీసీ భవన్‌లో జయంతి ఉత్సవాలకు సంబంధించి ముందస్తు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డెర నేతలు లక్ష్మీకాంతయ్యను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్య పోరాట చరిత్రలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి సర్వసైన్యాధ్యక్షులుగా బ్రిటీష్ వారిపై తిరుగుబాటు చేసిన పోరాట వీరుడు వడ్డె ఓబన్న అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలని కోరారు. బీసీ భవన్ ప్రాంగణంలో ఉన్న వడ్డె ఓబన్న విగ్రహం వద్ద నిర్వహించనున్న జయంతి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో వడ్డెర్లు, ప్రజా, బీసీ సంఘాల నాయకులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం నాయకులు సంపంగి మల్లయ్య, కే రామకృష్ణ, చంద్రికమ్మ, పెద్ద వెంకటరాముడు, లక్ష్మీనారాయణ, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ జిల్లా జట్టు ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో గురువారం జిల్లా స్థాయి కబడ్డీ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీలను సీఈఓ రమణ ప్రారంభించి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 7, 8 తేదీల్లో నెల్లూరులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి శాప్ కబడ్డీ పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ప్రధాన శిక్షకులు నటరాజరావు, కబడ్డీ శిక్షకులు భూపతిరావు, వ్యాయామ ఉపాధ్యాయులు దస్తగిరి పాల్గొన్నారు.

గ్రామ శాఖలను పటిష్టం చేసుకోండి

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో పార్టీని బలోపేతంచేయడంతో పాటు ప్రతి గ్రామంలో నూతన శాఖలను ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. గురువారం సీపీఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రైతాంగ సమస్యలపై పోరాటాలను ఉధృతం చేయాలన్నారు. ఏపీకి ప్రత్యేక, విభజన హామీలను నెరవేర్చేందుకు కేంద్రంపై పోరాటాలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పి.రామచంద్రయ్య, బి.గిడ్డయ్య, మునెప్ప తదితరులు పాల్గొన్నారు.

వీఎంసీ ఏడీహెచ్ కర్నూలు బదిలీ

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థ ఉద్యానవన విభాగం అధికారిగా విధు లు నిర్వహిస్తున్న బి.శ్రీనివాసును ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయన్ను కర్నూలు ఉద్యానవన విభాగం అధికారిగా బదిలీ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. గత ఏడాది డిసెంబర్‌లో ఇక్కడికి వచ్చిన శ్రీనివాసు ఏడాదిపాటు వీఎంసీలో విధులు నిర్వహించారు.

8న ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమావేశం

కర్నూలు(అర్బన్): ఈ నెల 8వ తేదీన కాకినాడలోని శ్రీ బాల త్రిపుర సుందరి ఆలయంలో ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర కమిటీ సమావేశం జరుగుతుందని రాష్ట్ర బ్రాహ్మణ అన్యాక్రాంతుల ఆస్తుల పరిరక్షణ కమిటీ చైర్మన్ సముద్రాల హనుమంతరావు తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా అమలైన కార్యక్రమాలు, పథకాలను పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరాలన్నారు. ఇటీవలి కాలంలో అర్చకులు, పురోహితులపై జరుగుతున్న దాడులపై చర్చించి చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు.

నర్సింగ్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో విద్యార్థుల నుంచి అధికంగా ఫీజులు వసూలు చేస్తున్న నర్సింగ్ కాలజీలపై చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ ఏవో డాక్టర్ నాగప్రసాద్‌కు ప్రగతిశీల యువజన సంఘం నాయకులు గురువారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ నర్సింగ్ కళాశాలల్లో ఫీజులు చెల్లించని విద్యార్థులను సర్టిఫికెట్లు ఇవ్వకుండా భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో నగర అధ్యక్షులు దినేష్, కార్యదర్శి రాము, నాయకులు స్వామి, ప్రభాస్, జశ్వంత్ ఉన్నారు.

ఉమ్మడి జిల్లాలో మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్‌చంద్రబోస్



కర్నూలు(రాజ్‌విహార్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో మరోసారి వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేస్తామని కర్నూలు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్‌చంద్రబోస్ అన్నారు. గురువారం స్థానిక బీ.క్యాంప్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదల కష్టాలు తెలుసుకున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చిన సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికీ మేలు జరుగుతోందని చెప్పారు. దీంతో ఆయన పథకాలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవడంతో సీఎంకు రోజురోజుకు ప్రజాధారణ పెరిగిపోతోందన్నారు. రాష్ట్ర ప్రజలంతా ఆయనకు సంపూర్ణంగా మద్దతుగా ఉన్నారని, ఉమ్మడి జిల్లాలో మరోసారి వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు ఓటమి భయంతో ప్రతి విషయాన్ని రాయకీయం చేసి లబ్ధి పొందాలని చూస్తున్నారని, ఎన్ని జిమ్మిక్కులు చేసినా ఆయన గెలిచే పరిస్థితి లేదన్నారు.

ఏసీపీ హయత్ బాధ్యతల స్వీకరణ

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగంలో అడిషనల్ సీటీ ప్లానర్ హయత్ మోహీద్దీన్ గురువారం బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఆయనను ప్రభుత్వం ఇటీవల ఇక్కడికి బదిలీ చేసింది. దీంతో బాధ్యతల అనంతరం నగర మేయర్ బీవై.రామయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఆర్‌యూలో 'స్వచ్ఛ ఇన్నోవేషన్ టెక్నాలజీ'

కర్నూలు సిటీ: రాయలసీమ యూనివర్సిటీలో వీసీ ఆచార్య ఆకెపోగు ఆనందరావు ఆదేశాల మేరకు గురువారం స్వచ్ఛ ఇన్నోవేషన్ టెక్నాలజీ ఛాలెంజ్ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ ఛాలెంజ్ కో ఆర్డినేటర్ శ్రీనివాసులు పాల్గొని వ్యర్థ పదార్థాల నిర్వహణపై వివరించారు. పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణపై విద్యార్థుల నుంచి కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలు రావాలన్నారు. ఈ ఆవిష్కరణల కోసం స్వచ్ఛ ఇన్నోవేషన్ టెక్నాలజీ ఛాలెంజ్ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ మధుసూదన్ వర్మ, రెక్టార్ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ రాష్ట్ర కమిటీలోకి ఎండీ అంజిబాబు

కర్నూలు(సెంట్రల్): ఇటీవల పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో సీఐటీయూ 16వ రాష్ట్ర మహాసభలు విజయవంతంగా ముగిశాయి. ఈ సభలో ముగింపులో సీఐటీయూ రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో కర్నూలు జిల్లా నుంచి పలువురుకి స్థానం లభించింది. రాష్ట్ర కార్యదర్శిగా ఎండీ అంజిబాబు, సభ్యులు పీఎస్ రాధాకృష్ణ, సీహెచ్‌సాయిబాబా, కౌన్సిల్ సభ్యులుగా కృష్ణ, ప్రభాకర్, రామాంజనేయులు, ఉమాదేవీలకు స్థానం లభించింది.

పార్కింగ్ స్థలాల ఆక్రమణల తొలగింపు

కర్నూలు (టౌన్): పార్కింగ్ స్థలాలను సైతం ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వాటిని గురువారం నగరపాలక టౌన్ ప్లానింగ్ అధికారులు జేసీబీ సహాయంతో కూల్చివేశారు. స్థానిక అబ్దుల్లాఖాన్ ఏస్టేట్‌లో పార్కింగ్ స్థలాన్ని ఆక్రమించి యజమానులు ర్యాంపు ఏర్పాటు చేశారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో టౌన్ ప్లానింగ్ సీటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ అక్కడికి వెళ్లి పార్కింగ్ స్థలంలోని నిర్మాణాలను తొలగించారు. ఈ సందర్భంగా సీటీ ప్లానర్ మాట్లాడుతూ అబ్దుల్లాఖాన్ ఏస్టేట్‌లో కాంప్లెక్స్ ప్లాన్‌లో పార్కింగ్ స్థలాలను చూపించి షాపులు నిర్మించినట్లు గుర్తించామన్నారు. ప్రస్తుతం ఉన్న చందన బ్రదర్స్ స్థలం కూడ ప్లాన్‌లో పార్కింగ్ స్థలంగా చూపించారన్నారు. అయితే ప్రజా ఉపయోగ కార్యక్రమాలకు తప్ప ఆ స్థలంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదన్నారు. వీటిపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. పూర్తి స్థాయిలో విచారించి వాటిని తొలగిస్తామని చెప్పారు. రాబోయే రోజుల్లో మరిన్ని అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

ఉగాది నాటికి 5 లక్షల ఇళ్లు పూర్తి చేయాలి

- కలెక్టర్లను ఆదేశించిన సీఎస్ జవహర్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్): మార్చి 22వ తేదీ ఉగాది నాటికీ 5 లక్షల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ఢిల్లీలోని ఏపీ భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, ఇతర అధికారులతో స్పందన అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇళ్ల నిర్మాణాలు, రీసర్వే, ఈ-క్రాప్ బుకింగ్, ఈకేవైసీ, సచివాలయ ఉద్యోగుల ముఖ హాజరు తదితర వాటిపై పలు సూచనలు చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పి.కోటేశ్వరరావు, జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ్‌తేజ, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, సీపీఓ అప్పలకొండ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రతి గడపకూ లబ్ధి


పోలీసు కాలనీలో లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో ప్రతి గడపకు లబ్ధి చేకూరిందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం కల్లూరు అర్బన్ 32వ వార్డు 80వ వార్డు సచివాలయం పరిధిలోని పోలీసు కాలనీలో స్థానిక కార్పొరేటర్ సాన శ్రీనివాసులు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలనీలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులను వివరిస్తూ, బుక్‌లెట్లను పంపిణీ చేశారు. రాబోయ్యే ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సాపురు మాధురి, కాశపోగు జయరాముడు, సంగాల సుదర్శన్‌రెడ్డి, దండు లక్ష్మీకాంతరెడ్డి, ఎరుకల వెంకటేశ్వర్లు, ఇప్పల నారాయణరెడ్డి, జెడ్పీటీసీ ఆల ప్రభాకర్‌రెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివ శంకర్‌రెడ్డి, 21వ వార్డు ఇన్‌చార్జ్ బాల చంద్రారెడ్డి, నాయకులు ఎ.హనుమంతురెడ్డి, సందేపోగు శివ, పెద్దన్న, గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

జీఓ ఒకటిని రద్దు చేయాలి

కర్నూలు(సెంట్రల్): రాష్ట్రంలోని రహదారులపై ర్యాలీలు, సభలను నిషేధిస్తూ ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నంబర్ ఒకటిని వెంటనే రద్దు చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి వి.మల్లికార్జున డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ర్యాలీలు, సభలు పెట్టుకోకూడదంటే రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కాలరాయడమేనన్నారు. రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు ర్యాలీలు, సభలే అస్త్రాలన్నారు. అయితే కేవలం మైదానాల్లో మాత్రమే నిర్వహించుకోవాలంటే ఎలా అని ప్రశ్నించారు. వెంటనే ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బి.మహేంద్రబాబు, రమేష్, అర్లప్ప, టి.తిరుపాల్ పాల్గొన్నారు.